క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. షంషీర్‌గంజ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, హుడా కాలనీ, ఎన్ఎంగూడ ఓహెచ్ ఫీడర్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సత్తర్‌బాగ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, ఘాజీబండ, ఐటీఐ కాలనీ ఫీడర్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో...

విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. శారద కాలేజీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 10 గం నుంచి 12 వరకు, డార్జిలింగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 11 గంటల నుంచి 1 గంట వరకు, పోలీసు క్వార్టర్స్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, జంగమ్మెట్ ఓహెచ్, జంగమ్మెట్ ఏబీసీ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నేడు కోటలో 5వ బోనం పూజ

గోల్కొండ: ఆషాఢ మాసపు బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా గోల్కొండ కోటలో గురువారం 5వ బోనం పూజ జరగనుంది. గోల్కొండ కోటలో కొలువుదీరి ఉన్న శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవార్లకు ఆషాఢ మాసంలో మొత్తం 9 పూజలు జరుగుతాయి. ఇందులో భాగంగానే నేడు 3వ పూజ జరగనుంది. దీనికి గాను కోటలో ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నేడు ఉచిత యాంటీ రేబీస్ టీకాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.విజయ్‌కుమార్

విజయనగర్‌కాలనీ: అంతర్జాతీయ జునోసిస్ డేను పురస్కరించుకుని పెంపుడు జంతువులకు ఉచిత యాంటిరేబిస్ టీకాలు ఇస్తున్నట్లు శాంతి నగర్ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మోర విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం విజయనగర్‌కాలనీలోని పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జంతువుల నుంచి మనుషులకు వచ్చే రోగాలు నివారించేందుకు యాంటిరేబిస్ వ్యాక్సిన్ పనిచేస్తుందన్నారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

11న రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం

చార్మినార్: బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని సుల్తాన్‌షాహీ అశోక్ మైదాన్‌లోని జగదాంబ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో పూజలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 11వ తేదీన శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా కనుల పండువగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 11.15 గంటలకు శ్రీ రేణుక ఎల్లమ్మ కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమంతో పాటు సాయంత్రం 6 గంటలకు పల్లకీ సేవ ఊరేగింపు తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించడానికి ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్ ఉప్పుగూడ అధ్యక్షుడిగా శ్యాంరావు



చాంద్రాయణగుట్ట: కాంగ్రెస్ పార్టీ ఉప్పుగూడ డివిజన్ అధ్యక్షుడిగా కాశమోని శ్యాంరావు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.మహేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్యాంరావు ముదిరాజ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు పార్టీ అధిష్టానానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నోట్ బుక్స్ పంపిణీ

గోల్కొండ: పేద విద్యార్థులకు అండగా ఉంటూ ప్రతి ఏటా వారికి నోట్ పుస్తకాలతోపాటు స్టేషనరీని కూడా అందిస్తున్నామని గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తి పని సంఘం అధ్యక్షులు బి. సాయిబాబాచారి అన్నారు. బుధవారం గోల్కొండ రిసాలబజార్‌లో వివిధ ప్రైవేటు పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులకు రిసాలబజార్‌లో నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందించారు. తమ సంఘం సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి ఏటా తాము పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, బి.శ్రీకాంత్ చారి తదితరులున్నారు.

మురుగు కాలువల్లా గోల్కొండ రోడ్లు



గోల్కొండ చోటా బజార్ ప్రధాన రహదారి దుస్థితి

గోల్కొండ: గోల్కొండలోని ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గోల్కొండ కోట పై ఆషాఢ మాస బోనాలు జరుగుతున్నా అధికారులు రోడ్లను పట్టించుకోవడం లేదు. కాగా గోల్కొండ కోట బోనాలకు వచ్చే భక్తులు, ఊరేగింపులు 80 శాతం వరకు చోటాబజార్ మీదుగానే గోల్కొండకు చేరుకుంటాయి. ముఖ్యంగా శివసత్తులు, పోతరాజులు సాంప్రదాయ నృత్యాలతో ధూంధాం చేస్తూ కోట పైకి వెళ్తారు. అయితే చోటా బజార్ పాత లేబర్ అడ్డా బడాబజార్ మీర్జా ప్యాలెస్ ఫంక్షన్ హాల్ రోడ్ల వద్ద ఉన్న మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు రోడ్లపై పారుతూ ఫతే దర్వాజ వరకు ప్రవహిస్తున్నది. కాగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, రాకపోకలు సాగించే సమయంలో రోడ్ల పై ఉన్న మురుగు పాదచారుల పై పడుతున్నది. అయినా కూడా గత్యంతరం లేక ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. మాన్‌సూన్ స్పెషల్ డ్రైవ్‌లు అంటూ జలమండలి, బల్దియా అధికారులు ఎంతో హంగామా చేస్తూ మాన్‌సూన్ టీంలను, వాహనాలను ప్రారంభించారు. అయితే ఈ మాన్‌సూన్ టీంలు ఎప్పుడు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నాయో తమకు తెలియడం లేదని పలువురు అంటున్నారు. ఏదేమైనా అధికారుల నిర్లక్ష్యం తమ పాలిట శాపంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. బోనాల కోసం ఆలయ పరిసరాలతో పాటు ఆలయాలకు వెళ్ళే రహదారులతో పాటు అభివృద్ధి చేస్తామంటున్న హామీలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. బోనాల సమయంలోనే అధికారుల నిర్లక్ష్యం ఇలా ఉందని, బోనాలు ముగిసిన తరువాత అధికారుల తీరు ఎలా ఉంటుందోనని ప్రజలు అంటున్నారు. శానిటేషన్ యూనిట్లు, మాన్‌సూన్ టీంలు కేవలం అధికారులు, స్థానిక నాయకుల కనుసన్నల్లోనే పని చేస్తున్నాయని పలువురు అంటున్నారు. నాలుగు వారాల క్రితం గోల్కొండ కోట బోనాలు ప్రారంభమయ్యాయని, ఆనాటి నుంచే డ్రైనేజీలు పొంగిపొర్లడం మొదలైందని, బల్దియా, పోలీస్ ఉన్నతాధికారులు గోల్కొండ కోటకు బోనాల కోటకు వస్తున్నారు. అయితే ఎవ్వరూ కూడా ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బల్దియ వార్డు కార్యాలయం గోల్కొండ కోట ఎదురుగా ఉన్నా కూడా వార్డు కార్యాలయ సిబ్బంది తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు మరింత చేరువై సేవలు అందించడానికి వార్డు కార్యాలయాలను ఆధునీకరించి కూడా లాభం లేకుండా పోయిందని పలువురు అంటున్నారు.

బీఆర్ఎస్ పార్టీని ప్రజలు బంగాళాఖాతంలో కలపడం ఖాయం

ఈటల రాజేందర్



ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న దేవర శ్రీనివాస్

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీకి చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఈటలను రాష్ట్ర కురుమ సంఘం నాయకులు కలిసి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.... వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు బంగాళఖాతంలో కలపడం ఖాయమని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి అవినీతి పాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని, మరోవైపు ఉద్యోగ కల్పనలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన అన్నారు. కురుమ సంఘం నాయకులు దేవర శ్రీనివాస్, దేవరవంశీ, బి.శ్రీనివాస్, శ్రీనాథ్, సురేష్, బీజేపి రాష్ట్ర నాయకురాలు ఉమ తదితరులున్నారు.

క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం



దర్పల్లి తేజాస్‌కు స్పోర్ట్స్ ట్రాక్‌ను అందజేస్తున్న డైరెక్టర్ శ్యామ్‌వెరా

జియాగూడ: జియాగూడ విద్యశ్రీ హైస్కూల్ విద్యార్థి దర్పల్లి తేజాస్ తెలంగాణ రాష్ట్ర స్థాయి రైఫిల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించడం గర్వకారణమని స్కూల్ డైరెక్టర్ శ్యామ్‌వెర అన్నారు. ఈ మేరకు బుధవారం జియాగూడలోని స్కూల్ ఆడిటోరియంలో 8వ తరగతి చదువుతున్న దర్పల్లి తేజాస్ రైఫిల్ 25 మీటర్ల పోటీలో గెలుపొందినందుకు గాను సన్మానించి స్పోర్ట్స్ ట్రాక్‌ను అందజేశారు. అనంతరం శ్యామ్‌వెరా మాట్లాడుతూ.... క్రీడల్లో రాణించే విద్యార్థులను తప్పకుండా ప్రోత్సాహిస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ సునిత శ్యామ్‌వెరా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఖచ్చితంగా అధికారంలోకి వస్తుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కురకుల కృష్ణ అన్నారు. బుధవారం కార్వాన్ బాంజవాడిలో కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ కేవలం అవినీతినేతన ఎజెండాగా పెట్టుకుందన్నారు. స్వయంగా బీఆర్ఎస్ నాయకులు అధికారుల మద్దతుతో వివిధ పోటీ పరీక్షల పేపర్ల లీకేజీకి తెరలేపుతున్నారని ఆయన అన్నారు. నిరుద్యోగం తెలంగాణలో గరిష్ట స్థాయిలో ఉందని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకోవాలన్న ఆలోచన కేసీఆర్‌కు లేదని ఆయన ఆరోపించారు. మరోవైపు బీజేపికి తెలంగాణలో నాయకులే లేరని, ఆ పార్టీ మాత్రం గొప్పలు చెప్పుకుంటూ అధికారంలోకి వస్తామంటూ ప్రచారం చేసుకోవడం విడ్డూరమని ఆయన అన్నారు.

బోనాల వేడుకలకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు



బీఆర్ఎస్ నాయకులతో సమావేశమైన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో నిర్వహించే బోనాల వేడుకలకు ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేపడుతామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బోనాల ఏర్పాట్లపై గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌గుప్తా, ధన్‌రాజ్, ఆనంద్‌కుమార్ గౌడ్, రాంచంద్రరాజు, ఆలపురుషోత్తమ్‌లతో మంత్రి సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి తలసాని మాట్లాడుతూ.... నియోజకవర్గంలోని అన్ని ఆలయాలకు త్వరలోనే బోనాల వేడుకల చెక్కులను పంపిణీ చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, టీఎస్ఎస్‌పీడీసీఎల్, రెవెన్యూ, ఇతర పలు శాఖల అధికారులు వేగవంతంగా ఏర్పాటు చేస్తారని మంత్రి తెలిపారు. ఆలయాలు, ఆలయాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించే విధంగా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించారు. అదేవిధంగా నాంపల్లి నియోజకవర్గ బోనాల ఏర్పాట్లపై నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ సీహెచ్ ఆనంద్‌కుమార్ గౌడ్‌తో మంత్రి సమావేశం ఏర్పాటు చేసి బోనాల ఏర్పాట్లపై వివరించారు.

కష్టించి పనిచేసేవారికి బీఆర్ఎస్‌లో సముచిత స్థానం



నియామక పత్రాన్ని అందజేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: కష్టించి పనిచేసే వారికి బీఆర్ఎస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. దళిత గ్రాడ్యుయేట్ అసోసియేషన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఎస్.ధన్‌రాజ్‌ను జాంబాగ్ డివిజన్ బీఆర్ఎస్ కో ఆర్డినేటర్, ప్రోగ్రామ్స్ ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తూ ఆదేశాలు ఆయనకు అందజేశారు. గోషామహల్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ..... ధన్‌రాజ్‌లాంటి చురుకైన నాయకుడు మరింత కష్టపడి గోషామహల్ నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా ఎగరవేసేందుకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, యోగేష్, ముఖేష్ ముదిరాజ్ శంకర్, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో పాత బకాయిలు ఇప్పించండి

అబిడ్స్: వాటర్‌బోర్డులో కాంట్రాక్టర్ల పాతబకాయిలు ఇప్పించాలని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని కాంట్రాక్టర్ల అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్‌చార్జ్ సెక్రెటరి పోల్కం శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. బుధవారం దారుసలాంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీని కలిసి పోల్కం శ్రీనివాస్ మెమోరాండం అందజేశారు. కొన్ని సంవత్సరాలుగా పనులు చేసిన పాత బకాయిలు బోర్డు ఎండీ దానకిశోర్ ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. బోర్డు ఎండీ దానకిశోర్‌తో మాట్లాడి పాతబకాయిలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చదువుతో పాటు ఆటపాటల్లో ముందుండాలి

అఫ్జల్‌గంజ్: విద్యార్థులు చదువుతో పాటు ఆట పాటల్లోనూ ముందుండాలని బోనాల శ్రీనివాస్ అన్నారు. ఇటీవల విక్టరీ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో మెడల్‌లు సాధించిన చిన్నారులను ఆయన అభినందించారు. బుధవారం మహారాజ్‌గంజ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఫెన్సింగ్ కోచ్‌లు వినోద్ సింగ్, జె వినయత ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెన్సింగ్ ట్రెనింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 1 సిల్వర్, 6 బ్రోంజ్ మెడల్‌లు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. నవనీత డగూర్, శిరీషా, శశాంక్, నటాశ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇప్పించండి

నాంపల్లి: తెలంగాణ ఉద్యమంలో కష్టపడ్డ నిరుపేద కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాల భర్తీకి సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇప్పించాలని పలువురు కళాకారులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారిని కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఏసీగార్డ్స్ నఫీజ్ రెసిడెన్సీలో 33 మూడు జిల్లాలకు చెందిన పలువురు కళాకారులు తెలంగాణ ఉద్యమంలో కాలికి గజ్జెకట్టి, గోసిగొంగడి వేసి, పాటలు పాడుతూ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్రను పోషించినట్లు వివరించారు. సాధించుకున్న రాష్ట్రంలో కళాకారులుగా తాము దుర్భరమైన జీవితాలను గడుపుతున్నట్లు విన్నవించారు. సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు పొందని 261 మంది కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు పొందడానికి తాము సీఎం కేసీఆర్‌ను కలిసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. స్పందించిన డాక్టర్ కె.వి.రమణాచారి సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇప్పించే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు కళాకారుడు అనువోజు వెంకటేశం తెలిపారు.

జీవీఆర్ సాహితీ పురస్కారాలు ప్రదానం

నాంపల్లి: జ్ఞానపీఠ పురస్కార స్వీకర్త డాక్టర్ రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశంకు, రావూరి కాంతమ్మ స్మారక సాహితీ సేవా పురస్కారాన్ని పరిమళా సోమేశ్వరానికి అందజేశారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏసీగార్డ్స్ నఫీజ్ రెసిడెన్సీలోని డాక్టర్ కేవీ రమణాచారి క్యాంపు కార్యాలయంలో పురస్కారాల ప్రదానోత్సవ సభ జరిగింది. నవలా రచయిత అలపర్తి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు డాక్టర్ రమణాచారి హాజరై పురస్కారాలు అందజేసి సత్కరించారు. కళా విపంచి బొప్పన నరసింహారావు, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకట్‌రెడ్డి, రావూరి వెంకట కోటేశ్వర రావు, రావూరి సాయి సుమంత్ పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

గోల్కొండ: పనులు సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్లపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని గోల్కొండ, టోలిచౌకి డివిజన్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా వరదనీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ పనులు జరుగుతున్న అన్ని ప్రాంతాలలో పనులు అతి నెమ్మదిగా జరుగుతున్నాయని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత కూడా నాసిరకంగా ఉందని, దీని పై తాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయిస్తానన్నారు. కార్వాన్‌లో సరికొత్త డ్రైనేజీ లైన్ల నిర్మాణానికి రూ.297 కోట్లు మంజూరు అయ్యాయని, ఈ పనులు పూర్తయితే కార్వాన్ నియోజకవర్గంల ఎక్కడా కూడా వరద ముంపు ప్రమాదం ఉండదని ఆయన అన్నారు.

గౌలిపురా అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పణ

గౌలిపురా: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం వజ్రోత్సవాల్లో భాగంగా గౌలిపురాలోని భరతమాత, కోట మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం కమిటీ అ ధ్యక్షులు రాందేవ్ అగర్వాల్, సలహాదారులు డాక్టర్ భరత్ ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ పాల్గొన్నారు.

అఖిల్ అహ్మద్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

అబిడ్స్: బేగంబజార్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు అఖిల్ అహ్మద్‌పై ఉన్న సస్పెన్షన్‌ను బీఆర్ఎస్ పార్టీ ఎత్తివేసింది. కొన్ని నెలల క్రితం ఓ కేసు విషయంలో అఖిల్ అహ్మద్‌ను బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేసిన విషయం విదితమే బుధవారం అఖిల్ అహ్మద్ పై సస్పెన్షన్‌ను ఎత్తివేసి పార్టీలో తిరిగి చేర్చుకుంటున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ ప్రకటించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అఖిల్ అహ్మద్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి పార్టీలో చేర్చుకుంటున్నట్లు తెలిపారు. అఖిల్‌అహ్మద్ మాట్లాడుతూ... తనపై సస్పెన్షన్‌ను ఎత్తివేసి తిరిగి పార్టీలో చేర్చుకున్న బీఆర్ఎస్ పార్టీ నందకిశోర్ వ్యాస్ బిలాల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు రెయిన్‌కోట్లు అందజేత



విద్యార్థులకు రెయిన్ కోర్టులు అందజేసిన దృశ్యం

అఫ్జల్‌గంజ్: వర్షాకాలంలో వర్షాల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వారికి రెయిన్ కోర్టులు అందించడానికి ముందుకు రావడం అభినందనీయమని అఫ్జల్‌గంజ్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పిఎల్ పద్మజాకుమారి అన్నారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో రెయిన్ కోర్టులను విరాళంగా అందించిన సిహెచ్ రాజును ప్రత్యేకంగా అభినందించి, విద్యార్థులకు రెయిన్‌కోర్టులను అందిజేశారు. ఉపాధ్యాయులు సి శివ శంకర్, అశోక్‌బాబు పాల్గొన్నారు.

మహంకాళి బోనాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కెవీ.రమణాచారి

నాంపల్లి: హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం 75వ బోనాల వజ్రోత్సవాల ఆహ్వాన పత్రికను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి బుధవారం ఏసీగార్డ్స్ నఫీజ్ రెసిడెన్సీలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంతో తనకు గత 30 ఏళ్ళకు పైగా అనుభవం ఉందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోనే బోనాల పండుగకు ప్రత్యేక ఆకర్షణగా ఏనుగు అంబారీపై అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారి ఘటం ఊరేగింపు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రాందేవ్ అగర్వాల్, సలహాదారులు జి.రాజారత్నం, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.పి.క్రాంతి కుమార్, సభ్యులు జగన్మోహన్ కపూర్, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నిలిచిపోయిన వరదనీటితో పాటు చెత్తా చెదారాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

చార్మినార్: డబుల్ బెడ్‌రూమ్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులను మజ్లీస్ పార్టీ చావునీ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ సాలెం షహీద్ కోరారు. బుధవారం ఆయన చావునీ డివిజన్‌లోని డబుల్ బెడ్‌రూం డిగ్నిటీ హౌసింగ్ కాలనీని సందర్శించి బి-బ్లాక్‌లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించడంతో పాటు వర్షం సందర్భంగా నిలిచిపోయిన వరదనీటిని తొలగించాలని ఆయన సంబంధిత ఏఎంహెచ్ఓను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు సయ్యద్ మస్తాన్, మన్సూర్, తాహేర్, పిల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు ఆహ్వానం



చార్మినార్: ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలకు హజరు కావాలని కోరుతూ గౌలిపురా కోట మైసమ్మ దేవాలయం కమిటీ కార్య నిర్వాహక అధ్యక్షులు కె.ఎస్.ఆనంద్ రావుకు హరిబౌలిలోని బంగారు మైసమ్మ దేవాలయం కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రం అందజేశారు. బంగారు మైసమ్మ దేవాలయం కమిటీ ప్రతినిధులు వినయ్ దిలీకర్, ప్రవీణ్ కుమార్ గౌడ్, హన్స్‌రాజ్ అనంతోజ్, రాజేష్, శ్రీధర్ తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ నెల 16వ తేదీన నిర్వహించే బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించనున్నామన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయనను కోరినట్లు తెలిపారు.

దొంగతనానికి పాల్పడిన ఇద్దరికి రిమాండ్

మరో మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలింపు



పోలీసుల అదుపులో నిందితులు.. స్వాధీనం చేసుకున్న వాహనం

సంతోష్‌నగర్: సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను ఐఎస్ సదన్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.40 వేల విలువ చేసే రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. బహదూర్‌పురాలో బిట్టు అనే స్నేహితుడి జన్మదిన వేడుకలను పూర్తి చేసుకొని బడంగ్‌పేట్‌లోని తమ నివాసానికి ఇద్దరు స్నేహితులు వాహనంపై తిరిగి వస్తున్నారు. కాగా లక్ష్మారెడ్డి గార్డెన్ వద్దకు రాగానే వాహనంలో పెట్రోల్ అయిపోవడంతో తోసుకుంటూ వెళుతున్నారు. కాగా అదే సమయంలో ప్రాంతానికి చెందిన రసుమల్ల సాకేత్ (23), మల్లేపడు తరుణ్ (19)తో పాటు మరో మైనర్ బాలుడు వారి వాహనాన్ని ఆపి వారితో వాగ్వాదానికి దిగిన వన్ ప్లస్-10ఆర్ మొబైల్, వివో వై-21 రెండు సెల్‌ఫోన్లను దొంగలించారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్‌లతో కలిసి దొంగతనానికి పాల్పడిన సాకేత్, తరుణ్‌లను పట్టుకొని వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, హోండా డియో (టీఎస్12ఈహెచ్4046) వాహనాన్ని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి తదుపరి విచారణ నిమిత్తం ఐఎస్‌సదన్ పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు అరెస్ట్ చేసి సాకేత్, తరుణ్‌లను రిమాండ్‌కు తరలించగా... మరో మైనర్ బాలున్ని జువైనల్ హోమ్‌కు తరలించారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తికి జైలు



మీర్ అక్రముద్దీన్ (ఫైల్)

డబీర్‌పురా: అనుమానాస్పదంగా తిరుగుతున్నఓ వ్యక్తికి బుధవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ రావు 30 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన మేరకు.. రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యాకుత్‌పురా అమన్‌నగర్-ఎ ప్రాంతానికి చెందిన వహాబ్ ఖాన్ (33) అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో రెయిన్‌బజార్ పోలీసులు అరెస్ట్ చేసి ఈ-పెట్టి కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసులు వహాబ్‌ను నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా... మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ రావు వహాబ్‌కు 30 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పోలీసులు వహాబ్‌కు జైలుకు తరలించారు.

మరో కేసులో వ్యక్తి 15 రోజుల జైలు శిక్ష...

మీర్‌చౌక్ పీఎస్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తికి బుధవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ రావు 15 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన మేరకు.. మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫలక్‌నుమా తీగలకుంట ప్రాంతానికి చెందిన మీర్ అక్రముద్దీన్ (20) అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేసి ఈ-పెట్టి కేసు నమోదు చేశారు. అనంతరం మీర్ అక్రముద్దీన్‌ను నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా... మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ రావు వహాబ్‌కు 15 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరికి..

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి పూట బస్తీలలో న్యూసెన్స్ చేస్తున్న ఇద్దరు యువకులకు నాంపల్లి న్యాయస్థానం 15 రోజుల జైలు శిక్షను విధించింది. జహనుమాకు చెందిన మహ్మద్ ఇర్ఫాన్ ఖాన్(21), అక్బర్ హుస్సేన్(28)లు మంగళవారం అర్ధరాత్రి వేళ కత్తితో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు ప్రశ్నించగా పొంతనలేని సమాధానం ఇచ్చారు. దీంతో వారిపై సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టడంతో 15 రోజుల జైలు శిక్ష పడింది. రాత్రి పూట ఆల్కహాల్, గంజాయి సేవించి మారణాయుదాలతో సంచరిస్తూ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఇదే తరహా శిక్షలు పడుతాయని ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర హెచ్చరించారు.

వైజాగ్ వెళ్లిన యువకుడు అదృశ్యం



ఓంకార్ (ఫైల్)

డబీర్‌పురా: మీటింగ్ ఉందని చెప్పి ఓ యువకుడు వైజాగ్‌కు వెళ్లి కనిపించకుండా పోయిన సంఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సుల్తాన్‌పురా అమీర్ మంజీల్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ కుమారుడు పి.ఓంకార్ (27) గత నెల 28న వైజాగ్‌లో మీటింగ్ ఉందని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి బయలు దేరాడు. అనంతరం ఫోన్‌లో అందుబాటులో లేకపోవడంతో తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.